

# అద్దెకుండి చూడు

**- చివుకుల రామమోహన్**

ఎన్నో ఏళ్ల నుండి ప్రభుత్వ క్వార్టర్సులో వున్న నాకు బాగా తెలిసిన వాళ్లు మా ఇంటికి అద్దెకి రండి అనగానే ఎగిరి గంతేసినంత పనైంది.

ఎందుకంటే పదవీ విరమణ కాగానే నెలాఖరున అద్దె ఇంట్లో చేరే నేను, వాళ్ల ఇన్విటేషన్ భగవదత్తంగా భావించాను. పైగా అద్దె మీ ఇష్టం అన్నారు. నాపై వాళ్ల ఎనలేని వాత్సల్యానికి తెగ సంబరపడి పోయానంటే వాస్తవ దూరం కాదు.

'ఏమోయ్ లక్ష్మీ! మనం (అంటే నేను) రిటైరు అయిన తర్వాత అద్దె ఇల్లు దొరకదని తెగ బాధపడ్డావు గదా? ఇవ్వాళ మన సాలూరు మేష్టారు, ఆయన భార్య మంగమ్మ సుల్తాన్‌బజార్‌లో కనపడ్డారోయ్' అన్నాను తెగ సంతోషంతో.

'అయితే ఏమిటంట' అంది లక్ష్మి.

'ఏం లేదోయ్... వాళ్ల స్థిర నివాసం హైదరాబాదట. వాళ్లకి చేదోడు వాదోడుగా ఎవరుంటారా అని చూస్తుంటే... నేను కన్పడటం, కొత్తగా వచ్చిన వాళ్లకి, దారినపోయే దానయ్యలాగా కాక, ఆత్మబంధువుగా కన్పడ్డానట. వాళ్లంత వాళ్లే- హిరణ్యాక్ష వరాలు ఏవీ అడగకుండా- అద్దె మీ ఇష్ట ప్రకారం ఇద్దురుగానీ రమ్మంటే నేను వెంటనే సరేనన్నాను.'

కొద్దిగా నసుగుతూ 'మీ ఇష్టమే నా ఇష్టం. నాదేముంది' అన్నది లక్ష్మి.

లక్ష్మి ముఖకవళికలని బట్టి- 'ఏంటి? నేను చేసింది తప్పంటావా?' అన్నాను అనునయంగా.

'ఏం లేదు. ఒకటికి రెండుసార్లు ఆలోచించి నిర్ణయం తీసుకుని వుంటే బాగుండేదేమో' అని సంశయంగా అంది లక్ష్మి.

మళ్లీ వెంటనే... 'మనం వెంటనే క్వార్టర్స్ ఖాళీ చెయ్యాలి గదా! సరే... మీ నిర్ణయమే నా నిర్ణయం' అంది లక్ష్మి స్థిరంగా.

అనుకున్నట్లుగా భాస్కరరావు దంపతులు (సాలూరు దంపతులు) మా ఇద్దరి అండదండలు ఆర్నెల్లు బాగానే వినియోగించుకున్నారు. ఎలక్ట్రిసిటీ, మున్సిపల్, టెలిఫోన్ బిల్లులు కట్టడం, వివిధ బ్యాంకుల్లో అకౌంట్లు ఓపెన్ చేయించటం నా పనయితే... లక్ష్మికి కూరగాయల కొనుగోళ్లు, బంగారు నగిషీల కార్యక్రమాలు తన వంతయింది. వాళ్ల సేవాపారాయణ మాకు సమిష్టి ఆదర్శమయింది.

కొన్ని మాసాలు గడిచాయి.

'ఏమండోయ్! మోటార్ వెయ్యమని పదేపదే చెప్పినా నీళ్లు ఎక్కించలేదండీ' అంది లక్ష్మి ఒకరోజు బాధగా. బట్టలు ఉతకాలంటే నీళ్లు లేక నానా యాతనగా ఉంది. వాషింగ్ మిషన్ కొన్నామే గానీ, దాన్ని వాడటానికి నీళ్ల ఆంక్ష వచ్చి పడింది' అంది లక్ష్మి నిట్టూరుస్తూ.

'ప్రతిరోజూ భయం భయంగా నీళ్లు వాడాల్సి వస్తున్నది. వాళ్లకి మీ వల్ల, నా వల్ల కావలసిన పనులన్నీ సాఫీగా నెరవేరాయి. ఇంక మన అవసరం వాళ్లకి లేదండీ. నీళ్ల ఋణం, నిద్ర ఋణం తీరినట్లుగా వుంది. అంచేత వేరే అద్దె ఇంటికి గౌరవంగా వెళ్లటం సముచితమని ఎంతో దూరదృష్టితో చెప్పింది భార్యామణి లక్ష్మి. భేదభావం వస్తే పెద్దంతరం - చిన్నంతరం వుండదంటారండీ. వాళ్లచేత పనిమనిషి విషయంగా, నీళ్ల విషయంగా మాటలు పడే ముందే, మనం ఇల్లు ఖాళీ చేస్తే మన మంచితనం కాపాడుకోవచ్చండీ'

భరించే వాడు భర్తే అయినా- అనుభవించేది భార్య అనే నూతన సూక్తి స్ఫురణకి వచ్చింది నాకు.

'లక్ష్మీ! నీ నిర్ణయాన్ని పూర్తిగా సపోర్ట్ చేస్తున్నాను. కాకపోతే చిన్న సవరణ. ఇంటి వాళ్లు వుంటే నీటి బాధలు తప్పవు కాబట్టి- ఇంటి వాళ్లు లేని అద్దె ఇంటికే మారదాము' అన్నాను.

'వారం రోజుల్లో ఇంటి వేట పూర్తిచేయాలి సుమా' అని హుకుం జారీ చేసింది శ్రీమతి.

నిర్ణయం తీసుకున్నంత తేలికా- యజమాని పోరు లేని అద్దె ఇల్లు దొరకడం!